# జి. భవానీకృష్ణమూర్తి

# వెన్నెల జల్లు

పక్షులు తమ కిలకిలా రావాలతో మేలుకొలుపులు పాడుతూండే నిద్ర మెలకువ వచ్చేసింది. చటుక్కున కళ్ళు తెరిచాను. అంతవరకూ కిటికీ తలుపుమీద ఠీవిగా నిలబడి కిచకిచలాడుతున్న పిచుకలజంట పట్టుబడిన దొంగల్లా రివ్వున బయటికి పారిపోయాయి.

అప్రయత్నంగానే నా పెదవులు విచ్చుకున్నాయి.

'ముచ్చటయిన జంట' అనుకోకుండా ఉండలేకపోయాను. పూజగదిలోనుంచి గంట గణగణా వినిపించింది.


అంటే, అప్పుడే నాన్నగారి పూజ ముగిసిందన్నమాట. దిగ్గునలేచి, మంచంమీదనుంచి దూకి పెరట్లోకి పరుగెత్తి రొటీన్‌పర్వం మొదలుపెట్టాను. రోజూ అదే పేస్టుతో, అదే బ్రష్‌తో, అదే ముఖాన్ని కడగడం అబ్బ! చెప్పలేనంత విసుగు అయినా తప్పదు.

బ్రష్ నోట్లో ఆడుతోంది, నేను పరిసరాలనీ, ప్రకృతిలోని అందచందాలనీ తిలకిస్తున్నాను.

"అక్కా! కాఫీ చల్లారిపోతోంది తొందరగా రావే" చెల్లి పిలుపుతో ముఖం కడగడం అయిందనిపించి లోపలికి నడిచి, కాఫీ గ్లాసు అందుకున్నాను.

పెరటిగుమ్మంలో కూర్చుని పొగలు కక్కుతున్న కాఫీని మెల్లగా ఊదుకుంటూ తాగడం మొదలుపెట్టాను.

మామిడిచెట్టు ఆకులు గాలికి అటుఇటూ ఊగుతూండే గోడమీద పడుతున్న నీడ కూడా అటూ ఇటూ ఊగుతోంది పాము మెలికల్లా.



పూజగదిలో నుంచి బయటికి వచ్చిన నాన్నగారు నావైపు చూసి, చిన్నగా నవ్వుతూ "ఏమ్మా! ఈ వేళ ఇంత ఆలస్యంగా లేచావు?" అన్నారు.

"పగలస్తమానూ నిద్రపోతుంది. అర్థరాత్రి దాకా కూర్చుని పుస్తకాలు నములుతూ తెల్లవారుఝామున పడుకుని బారెడు పొద్దెక్కాక లేస్తుంది" రుసరుసలాడింది అమ్మ, నాన్నగారికి కాఫీ గ్లాసు అందిస్తూ.

నిజమే కనుక నేనేమీ మాట్లాడలేదు. చిన్నగా నవ్వేసి ఊరుకున్నాను. శెలవులు ఇంత దుర్భరంగా ఉంటాయని మొదటిసారిగా తెలిసింది నాకు.

అందుకు కారణం అయిన అజీజ్ కళ్ళల్లో మెదిలాడు. అతని చిలిపి నవ్వుకి నా పెదవులు బదులిచ్చాయి. కొంటెచూపుకి నా చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

పదిరోజులైంది అతన్ని వదిలిపెట్టి వచ్చి. ఊహూ! కాదు...పదియుగాలు అయినట్టుంది.

"అక్కా! ఏమిటే కాఫీ గ్లాసు చేత్తో పట్టుకుని ఏ లోకంలో విహరిస్తున్నావే?" చెల్లి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. చల్లారిపోయిన కాఫీ రెండు గుక్కల్లో తాగేసి లేచి లోపలికొచ్చాను.

గడచిన రెండు సంవత్సరాలుగా నేను కాకినాడలో కాలేజీలో చదువుతున్న చదువుకి ఫలితం అజీజ్‌తో స్నేహం. ఇంకొక్క సంవత్సరం చదు

పుంది. అరయిపోతే తను, అజీజ్ కులమతాల అడ్డుగోడల్ని ఛేదించుకుని రెక్కలొచ్చిన పక్షుల్లా ఎత్తైన ఎగిరిపోయి ఆనందలోకాల్లో విహరిస్తారు.

ఎవరో వీపుమీద ఛళ్ళున చరిచినట్లయింది.

ఇంత తేలిగ్గా, ఊహిస్తున్నాను కానీ, తీరా అప్పుడు ఈ సమస్యని ఎలా ఎదుర్కోగలను?

అమ్మ నాన్న ఈ పెళ్ళికి ఒప్పుకుంటారో లేదో? మైగాడ్! ఒప్పుకోకపోతే ఏం చెయ్యాలి? భయంతో వణికిపోయాను. అజీజ్‌ని వదిలిపెట్టి ఒక్క క్షణంకూడా ఉండలేనుమరి.


ఈ సమస్య పరిష్కారం అయ్యేదెలా? ఆలోచిస్తూ కూర్చుండిపోయాను.

* * *

ఈపూరి హైస్కూలులో లెక్కల టీచరుగా పనిచేస్తున్నారు నాన్నగారు. నా కోరిక కాదనలేక శక్తికి మించినదే అయినా కాలేజీలో చేర్చి చదివిస్తున్నారు.

చెల్లి ఈ ఏడాది టెన్తులోకి వచ్చింది.

ఈ ఊళ్ళో నాన్నగారికున్న పలుకుబడి, గౌరవంతో ప్రశాంతంగా సాగుతున్న సంసారంలో తన పెళ్ళి గొప్ప విప్లవాన్ని లేవదీయబోతోంది.



కులమతాలు మంటకలిశాయని తండ్రి రౌద్రమూర్తి అయితే, తల్లి గుండెలు బాదుకుని ఏడుస్తుంది. చెల్లికి పెళ్ళికాదు...అవును. తనీవిషయం ఇంతవరకూ ఆలోచించనేలేదు. అవును తన మూలంగా తన ముద్దులచెల్లికి పెళ్ళికాదు.

పెళ్ళికాకుండా చెల్లి ఉసురుమంటూ జీవితం గడుపుతూంటే తను హాయిగా అజీజ్‌తో కాపురం చెయ్యగలదా? నో! కేవలం తన సుఖం మాత్రమే చూసుకునేంత స్వార్థపరురాలా తను? అలా-అని అజీజ్‌ని వదిలి...తల్లిదండ్రులు తెచ్చిన సంబంధం చేసుకుని...నో...అది జరిగేపని కాదు.

మిగిలిన రోజులు అన్యమనస్కంగానే గడిపాను.

ఒంట్లో బాగాలేదని అమ్మా నాన్న కంగారు పడ్డారు.

"ఏమిటే అక్కా అలా ఉంటున్నావ్" అంటూ పరామర్శించింది చెల్లి. ఏడాది తరువాత జరుగబోయే దానికి ఇప్పటినుంచి రాద్ధాంతం లేవదీయడంఎందుకని మాట తప్పించేశాను. వారంరోజుల్లో కాలేజీ తెరుస్తారనగా కాకినాడ బయలుదేరాను.

స్టేషన్‌లో బండి దిగగానే ఎదురొచ్చాడు అజీజ్. అతన్ని చూడగానే నా కళ్ళల్లో కోటి చందమామల కాంతి వెల్లివిరిసింది. గబగబ దగ్గరికి వెళ్ళి అతను చాపిన చేతిని అందుకున్నాను. చాలా రోజుల తరువాత అతన్ని చూసిన ఆనందంతో నా కళ్ళు చెమర్చాయి.

"సిల్లీగర్ల్! కమాన్! నీకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు చూస్తున్నాను తెల్సా?" నన్ను తన ప్రేమతో తడిపేస్తున్నాడు తన చూపులతో.

"ఏంటీ, ఇంద్రుడిలా అతి తెలివిని ప్రదర్శించబోయి ఒళ్ళంతా కళ్ళు సంపాదించుకున్నావా?" చిలిపిగా నవ్వాను కర్చీఫ్‌తో కళ్ళొత్తుకుంటూ.

"నా ప్రియ తప్ప నా కళ్ళకి ఇంకెవరూ కనిపించరు. నా ప్రియని తనివితీరా చూడ్డంకోసం ఈ నెల్లాళ్ళు తపస్సుచేసి ఒళ్ళంతా కళ్ళు సంపాదించాను" అంటూ నా నుదురు మెత్తని పెదవులతో సున్నితంగా నొక్కుతూ.

నామీద అతనికున్న ప్రేమకి గర్వంగా ఫీలయ్యాను.

"పద తర్వాత మాట్లాడుకుందాం" నా చేతిని పట్టుకునే బయటికి నడిచాడు.

మా వెనుక పోర్టరు సామాను తెచ్చాడు.

నన్ను హాస్టల్లో దింపి సాయంకాలం సంకేత స్థలానికి రమ్మని చెప్పి వెళ్ళిపోయాడు.

స్నానం చేసి బడలిక తీర్చుకుని తృప్తిగా పడుకుని నిద్రపోయాను. ఈ సెలవుల్లో నాకు అయిన అలవాటు ఆ పాడు నిద్ర. ఆ లేవడం లేవడం సాయంకాలం నాలుగు గంటలకి లేచాను. కడుపులో ఆకలి కరకరలాడుతోంది. అప్పుడు గుర్తొచ్చింది మధ్యాహ్నం భోజనం చెయ్యలేదని. అమ్మ ఇచ్చిన పూతరేకులు, జంతికలు తిని కడుపు నింపుకున్నాను. కొన్ని పేక్ చేసి హేండ్ బాగ్‌లో పెట్టుకున్నాను అజీజ్ కోసం.

గబగబా స్నానంచేసి, నీట్‌గా డ్రెస్ అయి మా సంకేత స్థలానికి బయలుదేరాను.

నన్ను చూడగానే అతని ముఖం కలువపూవులా విచ్చుకుంది. ఎదురొచ్చి నా చేతిని అందుకున్నాడు.

చెట్టా పట్టా లేసుకుని ఇద్దరం కొంతదూరం నడిచి ఒక చోట కూర్చున్నాం.

సెలవుల్లో ఎవరం ఎలా గడిపిందీ ఒకరికొకరం చెప్పుకుంటూ ఆ పూతరేకులు, జంతికలకి పని చెప్పాం.

అంతా అయ్యాక చివరిగా గత నెలరోజులుగా నా మనసుని కలవర పరుస్తున్న సమస్యని అతనికి చెప్పేశాను.

"అజీ! నా స్వార్థంకోసం ఏమీ ఎరుగని నా చెల్లి జీవితాన్ని పాడు చెయ్యడానికి నాకు మనసొప్పడంలేదు. అలా అని-నిన్నూ వదులుకో లేను" అంటూంటే నా గొంతు వణికింది. కళ్ళు నీళ్ళతో నిండుకున్నాయి.

"ఇంకా సంవత్సరం ఉంది. ఏదో పరిష్కార మార్గం ఆలోచిద్దాం. ఇప్పటినుంచీ నువ్విలా బెంగ పెట్టుకోకు" ఓదార్పుగా నాభుజం తట్టాడు.

చిరుచీకట్లు ముసురుకుంటున్నాయి. మెల్లగా లేచి బయలుదేరాం.



## రైట్ కాండిడేట్

పోలీసు యింటర్వ్యూ కెళ్ళాడు ఓ యువకుడు. అక్కడ "ఎవరైనా పర్సు పోయిందని కంప్లయింటు చేస్తే నువ్వు వెంటనే ఏం చేస్తావు?" అడిగారు అధికార్లు.

"ముందా పర్సులో ఎంత డబ్బుందో కనుక్కుంటా!" అన్నాడా యువకుడు. వెంటనే సెలెక్టు చేశారు.

మంత్రాల
శ్రీకాకుళం

మా రూమ్మేట్స్ ఇంకా ఊరునుంచి రాలేదు ఒంటరిగా పడుకోవడంతో నాకు నిద్ర పట్టలేదు.

మరునాడు బీచ్‌లో కలిసినప్పుడు "ప్రియా! బ్రహ్మాండమైన ఐడియా" అన్నాడు అజీజ్.

ఏమిటి అన్నట్లు కనుబొమలెగరేశాను.

"ప్రియా! నా స్నేహితుడు జేమ్స్ అని ఒకడున్నాడు. వాడు చాలా మంచివాడు. ఆదర్శ భావాలు కలవాడు. మీ చెల్లిని పెళ్ళిచేసుకోడానికి అతను అంగీకరించాడు" అంటూంటే నేనుదిమ్మెర పోయాను. గుండె యమస్పీడుగా కొట్టుకోవడం మొదలుపెట్టింది.

మా పెళ్ళి జరగడమే కష్టం అనుకుంటూంటే జేమ్స్‌తో చెల్లి పెళ్ళా? అది సంభవమేనా? ఊపిరి పీల్చడం మరచిపోయానొక్కక్షణం.

"ఏమిటోయ్, నువ్వు సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతావని నేను అనుకుంటే ఇలా ఫ్యూజు పోయినట్లు నీ ముఖంలో చీకట్లు నిండుకున్నాయి" మాటలతోపాటు అజీజ్ చెయ్యి నా భుజాలమీద పడడంతో, ఆ సందేహాన్ని కూడా బయట పెట్టేశాను.

"నువ్వో ట్యూబులైటువి. అన్నిటికీ ఊరికే భయపడడం తప్ప కాస్త నిశితంగా ఆలోచించవు. దానికి నేనే ఏదో ఏర్పాటు చేసానుగా" అభయం ఇచ్చాడు.

ఫలితంగా దసరా సెలవులకి మా ఊరు వెళ్ళినప్పుడు చెల్లిని నాతో కాకినాడ తీసుకొచ్చాను పది రోజులుండి వస్తుందని అమ్మ, నాన్నలతో చెప్పి.

అజీజ్‌కి చెల్లిని పరిచయం చేశాను. అతని సుందరరూపానికి, మంచితనానికి ముగ్ధురాలైన చెల్లి "అక్కా! అమ్మా, నాన్న నాలుగురోజులు గోణుక్కుని వాళ్ళే ఊరుకుంటారు. గప్‌చిప్‌గా ఇతన్ని పెళ్ళిచేసుకోవే" ఆరిందాలా సలహా ఇచ్చింది చెల్లి.

చిన్నపిల్ల అనుకుంటూ దాని భవిష్యత్తుకోసం నేను ఆలోచిస్తూంటే అది నాకే సలహాలిస్తోంది నవ్వుకున్నాను.

ఆ సాయంకాలం అజీజ్‌తోపాటు జేమ్స్ కూడా బీచ్‌కి వచ్చాడు.

అజీజ్‌లాగే అతనూ చలాకీ అయినవాడు. ఇట్టే మాతో కలిసిపోయి, చిరపరిచితుడిలా కబుర్లు చెప్పాడు. సముద్రుడుచేసే అల్లరిముందు మా చిలిపినవ్వులే, కేరింతలే ఎంతో బాగున్నాయి అన్నట్లు మెచ్చుకోలుతో చిలిపి జల్లులతో అభినందించాడు సముద్రుడే.

మా పెళ్ళిళ్ళ గురించి నేనింకా ఆలోచనలతో కొట్టుమిట్టాడుతూండగానే "అక్కా! రిజిష్టర్ మేరేజ్ చేసేసుకుని ఏకంగా మనఊరు వెళదాం" అంది చెల్లి.

"మరి, అమ్మా-నాన్నా-" దాని ధైర్యానికి నేను విస్తుపోతున్నాను.

"ఆ! నాలుగురోజులు మూతి ముడిచిపెట్టుకుని కూర్చున్నా మళ్ళీ మనల్ని చేరదీస్తారు" అంది అతి తేలిగ్గా.

దానికి తెలుసు అమ్మకీ, నాన్నకీ మేమంటే ప్రాణమని, మమ్మల్ని వదిలి పట్టుమని పదిరోజులైనా ఉండలేరని. అది నిజమే. వారిఅనురాగాన్ని ఆసరాగా చేసుకుని...వారికి చెప్పకుండా స్వతంత్రించి ఇలా పెళ్ళిచేసుకోవడం ఏం బాగుంటుంది? మథనపడసాగాను. కానీ, చెల్లి ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంలేదు. అది జేమ్స్‌మీద ప్రేమని పెంచుకుంటోంది రోజురోజుకీ.


తొలి పరిచయంతోనే అతని వ్యక్తిత్వంమీద నమ్మకం కుదరడంతో నేనూ దానికి అభ్యంతరం చెప్పడంలేదు. అసలు దాన్ని మా ఊరునుంచి తీసుకురావడంలో నా ఉద్దేశ్యం అదేకదా!

చెల్లి ప్రోత్సాహంతో, అజీజ్ ధైర్య వచనాలతో పెళ్ళికి తలవంచాను.

రిజిష్ట్రారు ఆఫీసులో అజీజ్ నేను, చెల్లి, జేమ్స్ దంపతులయ్యాము.

మా ఊరు బయలుదేరాము.

నా గుండె దడదడలాడుతోంది. కాళ్ళు వణుకుతున్నాయి.



"ఇంత పిరికి దానివేమిటే అక్కా? మనకి నచ్చిన వాళ్ళని మనం చేసుకున్నాం. అందులో తప్పేముంది? ఏదో చెయ్యరాని నేరం చేసినట్లు అలా వణికిపోతున్నావేమిటి?" అంటున్న చెల్లివైపు పిచ్చిగా చూశాను.

"నాకంటే అది నాలుగైదేళ్లు చిన్నది. అయినా నాకంటే చొరవకలది. తెలివి తేటలున్నంత మాత్రాన చాలదు. ధైర్యం, చొరవా ఉన్నవాళ్ళే దేనినైనా సాధించగలుగుతారు. చెల్లి అదృష్టవంతురాలు. జీవితాన్ని తనకి కావలసిన, నచ్చినవిధంగా తీర్చి దిద్దుకోగలదు" అనుకున్నాను మనస్ఫూర్తిగా.

మా నలుగుర్నీ చూడగానే అమ్మా, నాన్న శిలా ప్రతిమల్లా నిలబడిపోయారు.

"ఏమిటి నాన్నా, అలా చూస్తున్నారు. కట్నం ఇచ్చి, బోలెడు డబ్బు ఖర్చుచేసి మా పెళ్ళిళ్ళు చెయ్యాల్సిన శ్రమనుంచి మిమ్మల్ని తప్పించాం మమ్మల్ని ఆశీర్వదించండి" జేమ్సు చెయ్యి అందుకుని చెల్లి అమ్మకి, నాన్నకి నమస్కరిస్తూంటే యాంత్రికంగా నేనూ అజీజ్‌తో కలసి నమస్కరించాను. అమ్మనాన్నల ముఖాలు చూస్తూవుంటే నా గుండెల్ని ఎవరో తడిబట్టని పిండుతున్నట్లుగా మెలితిప్పుతున్నట్లు ఫీలయ్యాను.

"చాలా సంతోషం తల్లీ, నా కూతుళ్ళు ఇంత సర్వస్వతంత్రులైనందుకు నా కెంత గర్వంగా ఉందో తెలుసా? నాఅంత అదృష్టవంతుడీలోకంలో ఇంకెవరూ ఉండడు" నాన్నగారి గొంతులో ఆవేదన స్పష్టం అవుతోంది.

"మమ్మల్ని క్షమించండినాన్నా, మిమ్మల్ని నొప్పించాలనికాదు. మీరుఒప్పుకోరని ఇలా సాహసించాం" అన్నాను గద్గదస్వరంతో.

"మీమీద నాకేమీ కోపంలేదమ్మా. మీ మంచి చెడ్డలు మీరు నిర్ణయించుకున్నారు. అంతేగా, కాకపోతే, ఫలానా రాఘవరావు కూతుళ్ళు ఇంత ఘన కార్యం చేశారని నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకుంటూ, మమ్మల్నిచూసి హేళనగా నవ్వుకుంటారు. చెప్పుకోనీ, మీకోసం ఆ అవమానాల్ని సంతోషంగా భరిస్తాం తల్లీ, ఎందుకంటే మీరు మా ప్రాణాలు, మిమ్మల్ని దూరంచేసుకుని మేము బ్రతకలేం కనుక" రానురాను దుఃఖంతో నాన్నగారి గొంతు పూడుకుపోతోంది.


"నాన్నా!" అంటూ నాన్న గుండెలమీద వాలిపోయాను ఏడుస్తూ. వారి ఈ అనురాగాన్ని ఆసరాగా చేసుకునేగా మేమీసాహసం చెయ్యగలిగాం.

"ఊరుకోతల్లీ, మీ జీవితాలు మీ ఇష్టం. కొంత వయస్సు వచ్చేవరకే మా బాధ్యత. కాకపోతే, మీ పెళ్ళిళ్ళగురించి ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. అవి తీరే యోగం మాకులేదు. మా దురదృష్టానికి మేము బాధపడాలి తప్ప మీమీద కోపం తెచ్చుకున్నందువల్ల మాకు జరిగేదేమిటి? శాంతా! అమ్మాయిలిద్దరినీ లోపలికి తీసికెళ్ళు" అన్నారు నాన్నగారు.

ఆయన ఔదార్యానికి, మంచి తనానికి ముఖ్యంగా మామీదున్న ప్రేమకి మరోసారి మనస్ఫూర్తిగా పాదాలంటి నమస్కరించాను, నాన్నగారికి, లోపలికెళ్ళబోయేముందు.

నాన్నగారు అల్లుళ్ళకి మర్యాదలు చెయ్యడంలో మునిగిపోయారు మమ్మల్ని అమ్మకి అప్పగించి.

అమ్మవెంట లోపలికి నడిచాం నేను, చెల్లి.




* * *

ఆరుబయట మంచాలు వేసుకుని కూర్చున్నాం. వెన్నెల జల్లులా, వెండిపుప్పొడిలా మెరుస్తోంది. మామిడిచెట్టు ఆకులు గాలికి కదులుతూంటే వెన్నెల ముగ్గులు పరుచుకుంటున్నాయి నేలమీద, కొమ్మల సందుల్లోనుంచి. నా మనసు పురివిప్పిన నెమలిలా, నాట్యం చేస్తోంది. కోరుకున్న భర్త, కోరుకున్న జీవితం, ఏ స్త్రీకయినా ఇంతకంటే ఏం కావాలి?

"అబ్బా! అక్కా, నీ ఆలోచనలరేడు అయిన బావగారు పక్కనుండగా, ఇంకా దేనిగురించి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" చెల్లి వేళాకోళం చెయ్యడంతో ఆలోచనలనుంచి తేరుకుని తలతిప్పి అజీజ్ వైపు చూశాను. పున్నమివెన్నెల పరుచుకున్న అతని ముఖం నిండు చందమామలా వెలిగిపోతోంది.

నా వైపు చూస్తున్న ఆ కళ్లు వింతకాంతితో మెరుస్తున్నాయి.

నా మనస్సులో కోటి చందమామల కాంతి నిండుకోగా ఆ వెన్నెలను జల్లులా అజీజ్‌పైనే వర్షింపజేశాను.

*

వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్

కరీంనగరం—505002: ఫోన్ : 2558

(ఇంగ్లీష్ మీడియం)

- 1984 — 85 సంవత్సరం L. K. G. నుండి 6 వ తరగతి వరకు విద్యా బోధన. ప్రతి సంవత్సరం ఒక తరగతి పెంచబడును.
- అనుభవజ్ఞులైన అధ్యాపకులచే CBSE సిలబస్ ద్వారా ఉన్నత స్థాయిలో విద్యా బోధన.
- వ్యక్తిగత శ్రద్ధ చూపుటకై ప్రతి తరగతిలో విద్యార్థుల సంఖ్య పరిమితం చేయబడినది.
- రవాణా సౌకర్యం మరియు బాల బాలికలకై చక్కటి హాస్టల్ సౌకర్యం కలదు.